


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



*నవలా రచనా పరిచయం*

*మొక్కపాటి నరసింహశాస్త్రి విరచిత ‘బారిస్టర్ పార్వతీశం‘ అసంఖ్యాక తెలుగు పాఠకులను అలరించి, తెలుగు హాస్యానికి కొత్త ఒరవడి పెట్టిన విశిష్ట నవల. బయటి ప్రపంచం తెలియకుండా పెరిగిన ఓ పల్లెటూరి అమాయకుడు పార్వతీశం - లండన్లో బారిస్టర్ కోర్సు చెయ్యాలని బయల్దేరి - మొదటిసారిగా రైలెక్కి, తర్వాత ఓడెక్కి, నెమ్మదిగా లండన్ చేరుకుని మొత్తమ్మీద అనుకున్నది సాధించడం ఇతివృత్తం. లండన్ చేరుకోవడం మొదటి భాగం. లండన్‌లో చదువు రెండో భాగం. చదువై దేశానికి తిరిగొచ్చేక మూడో భాగం. ఈ ‘ఫారిన్ వెళ్లాలండి‘ నవల ప్రవాసాంధ్రుడిగా ప్రపంచాన్ని చూసిన ఓ విద్యాధిక వివాహితుడు రాజారావు ప్రభుత్వపు పనుపున ఇష్టాయిష్టాల మధ్య నలుగుతూ, 1973 సంవత్సరంలో, జర్మనీ ప్రయాణానికి ఉద్యుక్తుడు కావడం ఇతివృత్తం. జర్మనీలో అతడి అనుభవాలు ‘ఫారిన్ వెళ్లానండి‘ గా రెండోభాగం. పార్వతీశం, రాజారావులవి పూర్తిగా భిన్న వ్యక్తిత్వాలైనా ప్రపంచ జ్ఞానంలో, స్పందనలో ఇద్దరూ ఒక్కటేనన్నిపించేటంత పోలిక ఉండడం విద్యాధికుల మనుకునేవారందరికీ గమనార్హం. ఎందుకంటే ‘బారిస్టర్ పార్వతీశం‘ మొక్కపాటివారి సృజన కావచ్చు. కానీ ఈ నవలలో పాత్రలు (పేర్లు మార్చి ఉండొచ్చు), సన్నివేశాలు అన్నీ వాస్తవాలు. మొక్కపాటి వారి భవిష్యద్దర్శనానికి అభివందనాలు.*

*ఇక ఈ నవలా రచన మూడు గొప్ప తెలుగు పద్యాలతో ముడిపడి ఉంది. మొదటిది-*

*‘చిప్పలోన పడిన చినుకు ముత్యంబయ్యె*
*నీటబడిన చినుకు నీట కలిసె*
*ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా*
*విశ్వదాభిరామ వినురవేమ‘.*

*స్వానుభవాలకి అక్షరరూపం ఇవ్వడానికి ఈ పద్యం ఎందరో రచయితలకిలాగే మాకూ ప్రేరణ. ఈ నవలకూనూ.*

*రెండవది*

*‘ఎవ్వడవీవు కాళ్లు మొగమ్మెరన ?‘ ‘హంసమ‘ ‘నెందునుందువో?‘*
*‘దవ్వుల మానసంబునను ‘దాన విశేషములేమి చెప్పుమా?‘*
*‘మవ్వపు కాంచనాబ్జములు , మౌక్తికముల్ కలవందు‘ ‘నత్తలో?‘*
*‘అవ్వి యెరుంగ‘నన్న ‘నహహా‘ యని నవ్వె బకంబులన్నియున్*

*మానససరోవరం నుండి ఎగిరి వచ్చి ఒక నీటిగుంటలో దిగిన రాజహంసతో అక్కడి కొంగల సంభాషణ ఈ ప్రాచీనపద్యం. మానస సరోవరంలోని విశేషాలేమంటే - అందమైన బంగారు పూలు, మేలి ముత్యాలూ ఉంటాయంది హంస. మరి నత్తలో అనడిగాయి కొంగలు. హంసకు నత్త లంటే తెలియదని తెలుసుకున్న కొంగలు అహహా యని నవ్వి ఎగతాళి చేశాయిట. ఒకవేళ ఓ కొంగ కనుక అనుకోకుండా హంసల గుంపులోకి వెడితే, బంగారు పూల గురించి తెలియనందుకు అదీ నవ్వుల పాలయ్యేది. ఇక్కడ కొంగలు*

గొప్పవా, హంసలు గొప్పవా అని కాక, ప్రతి సమాజంలోనూ గొప్పతనానికి ఓ నిర్వచనం ఉంటుందని ముఖ్యంగా ప్రవాసంలో ఉన్నవారు గ్రహించాలి. అప్పుడు ఎవరికీ మిడిసిపాటుండదు. ఇది ప్రవాసాంధ్రులుగా, ప్రవాస భారతీయులుగా, అనుభవాలనుంచి మేమందుకున్న సందేశం. అది ఈ నవల్లో అంతర్లీనం.

మూడవది-

కమలములు నీటబాసిన
కమలాప్తుని రస్మి సోకి కమలిన భంగిన్
తమతమ నెలవులు దప్పిన
తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ

మనకి మన అలవాట్లే మంచిమిత్రులు. స్థలం మారితే అలవాట్లే శత్రువులు కావచ్చు. అప్పుడా అలవాట్లు మార్చుకోవాలా, శత్రువుల్ని మార్చుకోవాలా అన్నది అవగాహనతో తీసుకోవాల్సిన వ్యక్తిగత నిర్ణయం. ఈ విషయంలో మా అనుభవాలు నేర్పిన పాఠాలే ఈ నవల కథాంశం.

కథలకు పేర్లు పెట్టడంలో సిద్ధహస్తులైన మాన్యులు రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన 'సొమ్ములు పోనాయండి' ప్రభావంతో ఈ నవలకు ఫారిన్ వెళ్లాలండి, ఫారిన్ వెళ్లానండి పేర్లు మాకు స్ఫురించడం జరిగింది. ఈ నవల ప్రచురణ సందర్భంగా వారిని సంస్మరించడం మా బాధ్యత.

రెండు భాగాల ఈ నవలకు - సాహితీలోకంలో విశిష్టమైన కౌముది గ్రంథాలయయోగం పడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. సంపాదకులు శ్రీ కిరణ్‌ప్రభకు ధన్యవాదాలు.

## (గత సంచిక తరువాయి)

### 2

> మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.

**అందరికీ నేను చెప్పాల్సిన** ముఖ్య విషయమొకటుంది.

ఫారిన్ వెళ్ళడం నా జీవితాశయం కాదు. ఆమాటకొస్తే నా స్వగ్రామమైన పేరవరం దాటి ఎక్కడికో వెళ్ళాలన్న కోరికేలేదు నాకు. పెద్దలు సంపాదించిన ఆస్తి నాన్నగారి చేతిలో కరిగిపోయి ఉండకపోతే నేనసలు కష్టపడి చదువుకునేవాణ్నో లేదోనని అనుమానమే నాకు.

నా జీవితాశయమేమిటో నాకే తెలియదు.

చదువులో నేను ఏకసంథాగ్రాహిని. పరీక్షల ముందు శ్రద్ధగా కాసేపు చదివి క్లాసులో అందరికంటే ఫస్టుగా వచ్చేవాణ్ణి. పెద్దలు చెడు అలవాట్లుగా గుర్తించినవాటికి దూరంగా ఉండేవాణ్ణి. చిన్నప్పట్నించీ ఇంతవరకూ నేనొక్కసారికూడా కాఫీ టీలు తాగలేదు. సిగరెట్లు కాల్చలేదు నామనసెంత దృఢమైనదంటే వీటిపై నాకెప్పుడూ రవంత మోజుకూడా ఏర్పడలేదు.

చిన్నప్పట్నించీ ఏ పుస్తకం చదివినా, ఎవరేది చెప్పినా విషయాన్ని యథాతథంగా తీసుకోక నా బుర్రలో వాటిగురించి మళ్ళీ ఆలోచించేవాడిని. ఏ విషయం విన్నా - అది చెప్పిన వారి మనస్తత్వానికి ముడిపెట్టడానికి ప్రయత్నించేవాణ్ణి. మనస్తత్వాల పట్ల నాకుగల ఈ ఆకర్షణ నన్ను రచయితను చేసింది.

నేను ఎమ్మెస్సీలో యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసై నా సబ్జెక్టులో పి.హెచ్.డీ చేసి, భువనేశ్వర్లో రీజినల్ రీసెర్చి లాబరేటరీలో ఉద్యోగం సంపాదించాను. అంతవరకూ ఒక్కసారికూడా ఫారిన్ వెళ్ళాలని ప్రయత్నించలేదు. ఎమ్మెస్సీ ప్యాసుకాగానే గట్టి ప్రయత్నాలు చేసివుంటే తప్పకుండా ఒకటి రెండు సంవత్సరాల్లో నాకు ఫారిన్ ఛాన్సు వచ్చివుండేది. కానీ అప్పట్లో నాకా కోరికలేదు.

నేను బాగా చదువుకున్నాను. చదువు నా జీవితాశయం కాదు. నేను రచయితనయ్యాను. అయితే రచనలు చేయడం నా జీవితాశయం కాదు. దురలవాట్లకు దూరంగా జీవితం గడుపుతున్నాను. కానీ అలా గడపడమే నా జీవితాశయం కాదు.

అయితే నా జీవితాశయమేమిటి?

ఈ ప్రశ్నకు బదులు దొరకలేదు. కానీ మనిషి జీవించడానికి జీవితాశయముండాలా అన్న మరో ప్రశ్న ఉదయించింది. ఆ ప్రశ్నకు జవాబు వెదకాలంటే అందులోంచి అంతులేని వేదాంతం పుడుతుంది. అదంతా ప్రస్తుతానికి మనకు అప్రస్తుతం.

ఇంతకీ ఫారిన్ వెళ్ళడం గురించి నేనిప్పుడెందుకాలోచిస్తున్నట్లు?

చదువు నా జీవితాశయం కాదు. నా పెద్దలు చదివించారు. నేను శ్రద్ధగా కష్టపడి చదివాను.

దొడ్లో తోటమాలి కూలిడబ్బులు తీసుకుని తోటపని చేస్తాడు. పని ప్రారంభించాక ఆ తోట తన స్వంతంకాకపోయినా దాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సలహాలిస్తాడు. పూర్తి పెత్తనమిస్తే తోటను అందంగా తయారు చేస్తాడు. ఆ తోట విరగబూసి, కాస్తే - తనే లాభం పొందుతున్నట్లు సంతోషిస్తాడు. గర్వపడతాడు.

నాన్నగారు చదువు విషయంలో నాకు పూర్తి పెత్తనమిచ్చారు తోటమాలి తోటపట్ల శ్రద్ధ వహించినట్లు నేను చదువుపట్ల శ్రద్ధ వహించాను. పంటకు వచ్చిన తోటలా నేనిప్పుడు నాన్నగారికి ఉపయోగపడుతున్నాను. నా చదువు నాకు తృప్తినిస్తోంది.

మా లాబరేటరీ నుంచి ఇప్పటికయిదుగురు జర్మనీ వెళ్ళారు. నలుగురప్పుడే తిరిగొచ్చేశారు. ఒకతను ప్రస్తుతం జర్మనీలో ఉన్నాడు.

భువనేశ్వర్లో నేను పనిచేస్తున్న లాబరేటరీ కౌన్సిలాఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి (C.S.I.R) అనే సంస్థకున్న సుమారు నలభై అనుబంధ సంస్థల్లోనూ ఒకటి. జర్మన్ అకడమిక్ ఎక్స్చేంజ్ సర్వీస్ అన్నపదాన్ని జర్మన్ భాషలోకి తర్జుమాచేసి పొడి అక్షరాలుగా రాస్తే DAAD అవుతుంది. మేమంతా ముచ్చటగా దాన్ని డాడ్ అని పిలుస్తాం. ఈ డాడ్ సంస్థ ప్రతి ఏటా ఢిల్లీలో ఇంటర్వ్యూ నిర్వహించి - సీయస్సయ్యార్ (CSIR) నుంచి పదిహేనుమందిని ఎన్నికచేసి పదహారు నెలలపాటు పశ్చిమ జర్మనీలో ఉండి వైజ్ఞానిక పరిశోధనలు జరిపిరావడానికి ఏర్పాట్లు చేస్తారు. ఈ ఇంటర్వ్యూకు సుమారు నలభై లాబరేటరీల నుంచి అనగా దేశం నలుమూలలనుంచీ అభ్యర్థులు వస్తారు. మా లాబరేటరీ డైరెక్టర్ ఈ సంవత్సరం మా సంస్థనుంచి నలుగురి పేర్లు రికమెండ్ చేశాడు. అందులో నాదీ వుంది.

నాన్నగారు చదివిస్తే చదువుకుని అందులో పైకి రావడానికి కృషిచేశాను. డైరెక్టరు నాపేరు రికమెండ్ చేస్తే రానున్న అవకాశం గురించి ఆలోచిస్తున్నాను.

ఇదే నాకూ, ఫారిన్ వెళ్ళాలన్న కోరికకూ గల అనుబంధం.

## 3

పేరవరం నుంచి భువనేశ్వర్ వెళ్ళాలంటే రెండు ప్రయాణాలున్నాయి. ఒకటి పేరవరం నుంచి రాజమండ్రి చేరుకోవడం, రెండవది రాజమండ్రి నుంచి భువనేశ్వర్ వెళ్ళడం. మొదటి ప్రయాణపు దూరం పది కిలోమీటర్ల లోపు. రెండవది సుమారు ఏడువందల

కిలోమీటర్లు. మొదటి పది కిలోమీటర్ల ప్రయాణంలోనూ కలిగిన అలసట - తరువాత ఏడు వందల కిలోమీటర్ల ప్రయాణంలోనూ పోతుంది. అదెలాగంటే..

కోనసీమకు ముఖద్వారమైన బొబ్బర్లంక గ్రామానికి సరిగ్గా రెండుమైళ్ళ దూరంలో ఉంది పేరవరం. మామూలుగా అయితే రెండూళ్ళకూ కాలినడక ప్రయాణం చాలు. సామాన్లున్నప్పుడే అసలిబ్బంది.

ఊళ్ళో రిక్షాలున్నాయి కానీ ముందుగా చెప్పి ఉంచుకోకపోతే దొరకవు. ఇంటిదగ్గర్నుంచి బయల్దేరిన రిక్షా సుమారు అరమైలు దూరం ప్రయాణించాక - నిలువెత్తు కాలవగట్టుమీద చేరాలి. రిక్షాని ఆ గట్టు ఎక్కించడమంటే మనిషికి తాడిచెట్టెక్కడం లాంటిదే! అక్కణ్ణించి అతుకుల గతుకుల రోడ్డుమీద ప్రయాణం చేసి బొబ్బర్లంక చేరుకోవాలి. అక్కడ లాంచీల రేవు రిక్షాస్టాండునుంచి ఫర్లాంగుకు తక్కువకాని దూరంలో ఉంటుంది. ఆ దూరానికి కూలీలు తప్పనిసరి. సామాను లాంచీలో పెట్టించడం, ఆ లాంచీ ఎక్కడం - రెండూ కూడా సర్కస్ ఫీటును మించినవే. డబడబ ధ్వనులతో లాంచీ ముప్పావుగంట ప్రయాణం చేసి మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రి లాంచీల రేవుకు చేరుస్తుంది. లాంచీల రేవునుంచి గోదావరిగట్టు నిలువెత్తు. మళ్ళీ కూలీలు. మళ్ళీ రిక్షాలు. అక్కణ్ణించి రైల్వేస్టేషన్.

అప్పుడు రైల్లో కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకుని రాత్రిభోంచేసి పడుకుని నిద్రపోతే తెల్లారేసరికి భువనేశ్వర్లో వుంటాం.

ఈ ప్రయాణం చేస్తున్నంతసేపూ నేను శ్రీమతితో ఫారిన్ గురించి చర్చించాను. సుమారు పదికిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రికి పేరవరం నుంచి పట్టేసమయంలో ఇండియా నుంచి పశ్చిమ జర్మనీ వెళ్ళవచ్చునన్నాను.

"అయితే ఆ ప్రయాణమే చేద్దాం" - అంది శ్రీమతి.

"సరేలే - ఇది పదిహేను రూపాయలతో అయింది. దానికి పదిహేను వేలైనా చాలవేమో!?" అన్నాను.

"అలాంటప్పుడు దాన్నీ దీన్నీ పోల్చడమెందుకు?" అని మందలించిందామె.

"ఒకసారి ఫారిన్ వెళ్ళిరా. అప్పుడు నువ్వు రెంటినీ పోల్చితీరతావు.."

"ఆ మాటకొస్తే మీరూ వెళ్ళలేదు." అని "ఏమండీ మనం నిజంగా ఫారిన్ వెడతామంటారా?" అంది శ్రీమతి.

"మన సంగతి చెప్పలేను కానీ నేను తప్పకుండా వెడతాననిపిస్తోంది -"

శ్రీమతి అదోలా నావంక చూసింది. వివాహమైన క్షణం నుంచీ మేమొకరినొకరు విడిచి ఉన్న సందర్భాలు చాలా తక్కువ. కలిసి తప్ప సినిమాలు చూడలేదు. ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్ళేవాళ్ళం. పిల్లలు పుట్టినా వాళ్ళనెత్తుకునే కలిసి తిరిగేవాళ్ళం తప్ప విడిగా ఎక్కడికీ వెళ్ళేవాళ్ళం కాదు. ఆఖరికి కూరల బజారుక్కూడా ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం.

"జర్మనీ పేరు చెప్పి - మీరు నన్ను వేరు చేస్తున్నారు" - అన్నట్లు చూసింది శ్రీమతి నావంక.

"నిన్ను నేను అన్నిచోట్లకూ తీసుకెళ్ళిన మాట నిజం. కానీ ఆఫీసుకు మాత్రం నేనొక్కడినే గదా వెళ్తాను. నేను జర్మనీ వెడితే అది ఆఫీసు పనిమీద... అందువల్ల మనం కలిసి వెళ్ళడం కుదరకపోవచ్చు" అన్నాను సంజాయిషీగా.

శ్రీమతి అదోలా నవ్వి - "జర్మనీలో కూడా నేను ఇంట్లోనే వుంటాను. ఆఫీసుకి రాను -" అంది.

అప్పటికి నా సంజాయిషీలోని తప్పు అర్థం కాగా "ముందు అవకాశం రానీ, తర్వాత విషయం ఆలోచిద్దాం" అన్నాను.

"నన్ను తీసుకు వెళ్ళకపోతే మానేయండిగానీ అలా మాత్రం అనొద్దు. మీరు తప్పక సెలక్టవుతారు -" అంది శ్రీమతి. నేనలాగనడం వల్ల నా సెలక్షన్ ఆగిపోతుందన్న భయం ఆమెలో కనపడింది.

మా లాబరేటరీ నుంచి ఇంటర్వ్యూకి నలుగురం వెడుతున్నాం. ఇలాంటి లాబరేటరీలు నలభైవున్నాయి. ఇందరిలో పదంటే పదిమంది సెలక్టవుతారు. ఆ పదిమందిలో నేనుంటానా?

రాత్రి బెర్తుమీద నిద్రలోకూడా నాకో కల వచ్చింది.

నేను ఇంటర్వ్యూకి వెళ్ళి చాలా చెత్తగా సమాధానాలు చెప్పాను. ఇలాంటివాడు జర్మనీ వెళ్ళడానికి పనికిరాడని ఇంటర్వ్యూలోనే వాళ్ళు చెప్పేశారు. ఆ నిరుత్సాహంతో మెలుకువ వచ్చి ఉలిక్కిపడి లేచికూర్చున్నాను.

"అదేమిటి? అలా ఉలిక్కిపడి లేచికూర్చున్నారు? తెల్లవారుతోంది కానీ భువనేశ్వర్ రావడానికింకా గంట టైముంది?" అంది శ్రీమతి. ఆమె ఎప్పుడో లేచికూర్చుని నావైపే చూస్తున్నట్లుంది.

కల గురించి చెబుదామనుకుని మానేశాను. తెల్లవారు ఝామున వచ్చిన కల నిజమవుతుందని శ్రీమతి బాధపడుతుంది. ఎదుటివాళ్ళు మనకు అదృష్టాన్ని వెతికితేనే ఆనందం. దురదృష్టాన్ని సూచిస్తే నచ్చదు.

జేబులోంచి నోట్‌బుక్ తీసి పెన్నుతో ఏదో రాయసాగాను.

"ఏదైనా కథకు అయిడియా వచ్చిందా?" అంది శ్రీమతి.

"కాదు. కలలోకి ఇంటర్వ్యూ వచ్చింది. ఎందుకైనా మంచిదని ఆ ప్రశ్నలు రాసుకుంటున్నాను -" అన్నాను. ప్రశ్నలింకా గుర్తున్నాయన్న మాట నిజం. వాటికి జవాబులు నాకు తెలియదు. ఇంటికెళ్ళాక పుస్తకాలు చూడాలి.

"తప్పకుండా రాసుకోండి. అసలే తెల్లవారుఝామున వచ్చినకల -" అంది. శ్రీమతి మెరుస్తున్న కళ్ళతో.

"బాబోయ్ - అలాగనకు -" అంటూ తెల్లవారుఝామున వచ్చిన కలలు నిజమవుతాయనుకోవడం మూర్ఖత్వమనిపించుకుంటుందని శ్రీమతితో వాదించాను.

"దీనికింత వాదనెందుకూ? మీకు మంచికలే వచ్చిందిగా -" అంది శ్రీమతి మెరుస్తున్న కళ్ళతో.

"ఏ పరిస్థితుల్లోనూ నేను మూర్ఖత్వాన్ని సహించను." అన్నాను.

సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి. నేను మూర్ఖత్వాన్ని సహించలేకపోతున్నానంటే - బహుశా నేనూ మూర్ఖుణ్ణయివుండాలి.

## 4

కొందరికి ఒక్క జీవితాశయం కూడా వుండదు. కొందరికి ఒకటికి మించి ఉంటాయి. అలాంటివారిలో రవి ఒకడు.

అతను నా సహోద్యోగి. మేమంతా ఒకే కాలనీలో ఉంటున్నాం. అతడు కాలనీలో ఉండగా తెలుగువారిలో ఎవరు ఊరికి వెళ్ళి తిరిగివచ్చినా అతడింట్లోనే భోంచేయాలన్నది అతడి జీవితాశయాల్లో ఒకటి. అతడి భార్యది కూడా అదే జీవితాశయం కావడం వల్ల - దానికి తిరుగులేకుండా పోయింది.

రైల్వేస్టేషన్నించి కాలనీకి చేరుకుని ఇంటితాళం తీసేసమయానికి ఆకాశంలోకి సూర్యుడింకా రాలేదుకానీ నాకు రవి దర్శనమైంది. నన్ను చూస్తూనే - "అయితే ట్రయిన్ లేటు కాలేదన్నమాట -" అన్నాడు రవి.

"ట్రయిన్ లేటే - కానీ ఎదురుచూసే మీకిబ్బంది కలిగించడం ఇష్టంలేక బరంపురంలో దిగి టాక్సీలో వచ్చేశాం -" అన్నాను సరదాగా.

రవి ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్నాడు. అది గ్రహించి - "ముఖాలు కడుక్కుని స్నానాలు చేసి టిఫిన్‌కి మీ యింటికి వస్తాం. అక్కణ్ణించి నేనూ, మీరూ కలిసి ఆఫీసుకు వెడదాం. లంచవర్లో భోజనం కూడా మీ యింట్లోనే-" అన్నాను.

రవి ఏమనుకున్నాడో తెలియదు కానీ అతడు పిలవకుండానే నేనలాగన్నందుకు శ్రీమతి కాస్త అభిమానపడి - అదెలా వెలిబుచ్చాలో తెలియక ఇబ్బంది పడుతోంది. రవిమాత్రం - "నాడైలాగు వినకుండా మీ డైలాగు చెప్పేశారు. అయితే టెలిగ్రాం సంగతి తర్వాత చెబుతాన్లెండి -" అంటూ వెనక్కు తిరిగాడు.

టెలిగ్రాం అనగానే నాలో కంగారుపుట్టి - "ఏ టెలిగ్రాం - ఇంటర్వ్యూ గురించా?" అనడిగాను.

రవి టెలిగ్రాం నా చేతిలో పెట్టి - "కంగ్రాట్యులేషన్స్ -" అని వెళ్ళిపోయాడు.

ఆంధ్రసచిత్రవారపత్రిక దీపావళి కథల పోటీని నిర్వహిస్తూ ఆరుకథలను ఎన్నుకుంది. వాటిని చదివేక పాఠకులు ఆ కథలకు వరుసక్రమాన్ని నిర్ణయించాలి. మొదటి ఎన్నికలో ఆరుకథలకూ సమంగా అయిదేసి వందలు చొప్పున బహుమతి ఉంటుంది. పాఠకులు ఎన్నిక అనంతరం వరుసక్రమాన్ని బట్టి హెచ్చుతగ్గులలో మళ్ళీ బహుమతులుంటాయి.

ఇప్పుడు నా కథ ఆరింట ఒకటిగా ఎన్నికైనట్లు ఈ టెలిగ్రాం చెబుతోంది.

ఇది కలం పేరుతో వ్రాసిన కథ. నా అసలు పేరుతో వ్రాసిన కథకు సరిగ్గా పది సంవత్సరాల క్రితం ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో మూడవ బహుమతి వచ్చింది. అది నా రచనా జీవితానికి ఒక మలుపు.

ఈ బహుమతి నా జీవితంలో మరో మలుపును సూచిస్తోందా?

"వసుంధర కలంపేరుకు బహుమతి రావడం ఇదే ప్రథమం కదూ?" అంది శ్రీమతి.

ఆమె అలాగనడానికి కారణముంది. ఇప్పుడిప్పుడే ఆమె తనూ రచనా వ్యాసంగంలో ప్రవేశిస్తోంది. ఆ కలం పేరులో ఇప్పుడామెది అణా వాటా కూడా లేకపోయినా ఏదో ఒకరోజున పదహారణాల వాటా దాకా ఎదుగనున్నదని నాకు తెలుసు.

"అవును -" అన్నాను.

"ఇప్పుడు మీకు వచ్చిన బహుమతి - రాబోయే జీవితం నవరసభరితంగా ఉంటుందని సూచిస్తోంది -" అంది శ్రీమతి.

"నీవడుగు పెట్టిన క్షణం నుంచీ నా జీవితం నవరసభరితం.."

"మీకలా అనిపించిందేమో కానీ - మన జీవితం నవరసభరితంగా ఎప్పుడు మారుతుందా అని నేనెదురు చూస్తున్నాను -" అంది శ్రీమతి. ఆ భావం మాటల్లోనేకాక ఆమె చూపుల్లో కూడా స్పష్టంగా కనిపించింది.

నాకు తెలుసు. శ్రీమతి నాగురించి చాలా త్యాగాలు చేయాల్సివచ్చింది. స్త్రీ సహజమైన ఎన్నో కోర్కెలనామె చంపుకుంది. మా నాన్నగారు నాకప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడం కోసం ఆమె నా ప్రతి చర్యనూ సమర్థిస్తూ - నాకు అంతులేని బలాన్ని ప్రసాదించింది.

ఆర్థికంగా నా పరిస్థితి బాగోలేదు. ఫారిన్ వెళ్ళే అవకాశం వస్తే నా జీవితం ఆర్థికపరంగా కూడా పెద్ద మలుపు తిరగవచ్చు.

"అయాం రియల్లీ వెరీసారీ వసూ!" అన్నాను.

శ్రీమతి నవ్వేసి - "మాటవరుసకన్నాను గానీ - నాకిప్పుడేం తక్కువైంది?" అంది. కానీ నవరసభరితమైన జీవితమామెకు ప్రసాదించాలన్న కోరిక నాలో అప్పుడే పుట్టింది. బహుశా ఫారిన్ వెడతానేమో!

## 5

ఇంటర్వ్యూ తేదీ తెలిసింది. వెళ్ళవలసిన నలుగురిలో సుధామ్, ఇంద్రసేన్ ఊళ్ళో లేరు. వాళ్ళకు టెలిగ్రాం ద్వారా మా ఆఫీసువాళ్ళు ఇంటర్వ్యూ తేదీ తెలియబరిచారు. ఇంటర్వ్యూ ఢిల్లీలో.

ఊళ్ళో ఉన్నది నేను, భూషణ్ అనే బెంగాలీ అతడు. మేము కలకత్తాకు రిజర్వేషన్ చేయించుకున్నాం. కలకత్తా నుంచి ఢిల్లీకి టికెట్సు రిజర్వుచేయమని - అక్కడున్న అన్నయ్యకుత్తరం రాశాను నేను.

నేను కలకత్తాకు కుటుంబంతో వెళ్ళాలనుకున్నాను. ఎందుకంటే అన్నయ్య కలకత్తాలో అప్పటికి మూడుసంవత్సరాలనుంచి ఉంటున్నాడు. అన్నయ్య పేరవరం వెళ్ళేటప్పుడు - దారిలో ఉంది గదా అని భువనేశ్వర్లో దిగడమే తప్ప - నేనింతవరకు కలకత్తా వెళ్ళలేదు. అందుకు కారణం నా ఆర్థికపరిస్థితే అయినా - ఆ విషయం అన్నయ్య దగ్గర దాచిపెట్టాను.

అన్నయ్య రిజర్వు బ్యాంకులో ఆఫీసరు. దేశంలో బ్యాంకు ఉద్యోగస్తులకున్న విలువ సైంటిస్టులకు లేదు. వాడు డబ్బును మంచినీళ్ళప్రాయంగా ఖర్చుపెట్టగలడు. నా ఇబ్బంది తెలిస్తే అన్నయ్య నాకు సాయపడతాడు. కానీ అన్నయ్యతో సమంగా నా భాధ్యతలు పంచుకున్నప్పుడే నా వ్యక్తిత్వం నిలబడుతుంది. అందుకే నేను ప్రయాణాలు అవసరమున్నప్పుడే చేస్తాను. ఇలాంటి నా జీవితం శ్రీమతికి నవరసభరితమెలాగౌతుంది?

ఇప్పుడు నా ఢిల్లీ ప్రయాణం కలకత్తా మీదగానే జరుగుతుంది. నా ప్రయాణపు ఖర్చులు ఆఫీసు భరిస్తుంది. కథకు బహుమతిగా కొంత డబ్బుకూడా వచ్చింది. ఈ అవకాశాన్ని నేను ఉపయోగించుకుని శ్రీమతి, పిల్లలు కలకత్తా చూసే ఏర్పాటు చేయాలి. నేను వాళ్ళను ఢిల్లీ వెళ్లేముందు కలకత్తాలో వదిలి తిరుగు ప్రయాణంలో కలకత్తాలో వారం రోజులుంటానని తెలియబరుస్తూ అన్నయ్యకు ఉత్తరం రాశాను. అన్నయ్య నా రాకకు హర్షాన్ని వ్యక్తపరుస్తూ వెంటనే జవాబు కూడా రాసేశాడు.

రైల్లో కలలో వచ్చిన ప్రశ్నలు లైబ్రరీలో పరిశీలించాను. ఆశ్చర్యమేమిటంటే అవి అర్థంలేనివి కాదు. నా సబ్జక్టుకు దూరపుబంధం ఉన్నవే! ఆ ప్రశ్నలు నాకెలా స్ఫురించాయోగానీ అవి ఇంటర్వ్యూలో వస్తే అదో వింతే అవుతుంది.

"ఇంటర్వ్యూ గురించి మీరు కూడా ఇంతలా ఆలోచిస్తారా?" అంది శ్రీమతి ఆశ్చర్యంగా.

"ఏం - ఎందుకాలోచించకూడదు?" అన్నాను.

"ఎమ్మెస్సీ పి.హెచ్.డి మీరు. కెమిస్ట్రీలో మీకు తెలియనిదుంటుందా?"

నేను నవ్వి - "అది నీకు తెలుసు. నాకు తెలుసు. అడిగేవాడికి తెలియాలి కదా-" అన్నాను అయితే మనసులో నేనావిషయాన్నంత తేలికగా తీసుకోనడంలేదు. అప్పటికి నేను జర్మనీలో ఇద్దరు ప్రొఫెసర్లకు ఉత్తరాలు రాసివున్నాను. ఒకాయన తన సంస్థలో రీసెర్చికి అనుకూల పరిస్థితులు లేవని రాశాడు.

రెండో ఆయన బెర్లిన్ టెక్నికల్ యూనివర్సిటీలో ఓ సంస్థకు డైరెక్టరు. ఆయన రెండవప్రపంచ యుద్ధంనాటికే పేరెన్నికగన్నవాడు. ఆయన నాకు జవాబురాస్తూ - తను కొద్దిమాసాల్లో రిటైరైపోతున్నాననీ - నా అప్లికేషన్ తన జూనియర్‌కిచ్చాననీ - ఆ జూనియర్ ప్రస్తుతం సెలవుల్లో ఉన్నాడనీ రాశాడు. ఆ జూనియర్ సెలవుల అనంతరం నాపట్ల ఆసక్తిని చూపిస్తూ ఉత్తరం రాశాడు.

ఈవిధంగా పశ్చిమ జర్మనీలోని సైంటిస్టు తనవద్ద రీసెర్చి చేయడానికి అంగీకరించడాన్ని "ప్లేస్‌మెంట్" దొరకడం అంటారు. ప్లేస్‌మెంట్ దొరికినవాళ్ళకు ఇంటర్వ్యూలో అవకాశాలు ఎక్కువ వుంటాయి. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సంస్థలో పనిచేయగలిగితే విజ్ఞానసముపార్జన, పరపతి దృష్ట్యాకూడా నాకెంతో లాభదాయకం.

జర్మన్ ప్రొఫెసర్ నాపట్ల ఆసక్తిని కనబరుస్తూ - అంతవరకూ నేను చేసిన పరిశోధనల వివరాలను పంపించమంటూ ఉత్తరం రాయగానే ఇంటర్వ్యూలో నెగ్గిన అనుభూతి చెందాను నేను. అయితే మా లాబరేటరీలోనే ముగ్గురికి ప్లేస్‌మెంట్సు దొరికాయి. అన్ని లాబరేటరీల్లోనూ కలిపి నాలాంటి వారింకా ఎందరున్నారో!

చూస్తూండగానే ఇంటర్వ్యూ ప్రయాణం రోజు వచ్చేసింది.

మేము ముందురోజు రాత్రే అన్నీ సర్దేసుకుని మర్నాడుదయం లేచి ముఖప్రక్షాళనం కావడంతోనే బ్రష్షులు వగైరాలుకూడా దాచేసుకున్నాం. ట్రయిన్ ఆ రాత్రి ఎనిమిదిగంటలకే అయినా అంతవరకూ మిగతా కార్యక్రమాలన్నీ రవి ఇంట్లోనే. అనగా స్నానాలు వాళ్ళింట్లోనే. తువ్వాళ్ళు వాళ్ళవే వాడాం. సబ్బు మాత్రం మాది వాడి మళ్ళీ దాచేశాం.

ఆరోజు మధ్యాహ్నం రవి ఇంట్లో భోంచేసి ఉత్సాహంగా లాబరేటరీకి వెళ్ళాను. వెళ్ళిన అరగంటకే రమేష్ అనే పేరుగల సహోద్యోగి నాకోసం అరగంటనుంచి వెతుకుతున్నట్లు తెలిసింది. అప్పుడు నేనూ అతడికోసం వెతికాను. ఇద్దరూ ఒకరికోసం ఒకరు దోబూచులాడి ఒకర్నొకరం కలుసుకునేందుకు మరో అరగంట పట్టింది.

"నీకేమైనా రైలుప్రయాణముందా?" అన్నాడు రమేష్ సీరియస్‌గా.

అతడు నాసెక్షన్ కాదు - "ఎలా తెలిసింది?" అన్నాను ఆశ్చర్యంగా.

అతడు గంభీరంగా - "రైల్వేవాళ్ళు చెప్పారు -" అన్నాడు.

అతను నా గురించి ఎందుకు వెదుకుతున్నాడోనని ఆత్రుతగా ఉన్న నాకప్పుడు జోకుకి నవ్వే మూడ్‌లేదు. అయినా నవ్వి, "నీకు పలుకుబడీ ఎక్కువని నాకు తెలుసు. విషయం చెప్పు" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇందులో నా పలుకుబడిదేముంది. వాళ్ళు నీగురించే ఫోన్ చేశారు. సమయానికి అక్కడ నేనున్నాను.." అన్నాడు రమేష్ "నాగురించి వాళ్ళకెలా తెలుసు?"

"నువ్వు రిజర్వేషన్ స్లిప్‌మీద అడ్రసు రాశావుట. దాన్నిబట్టి ఫోన్ చేశారు. ఖర్గపూర్ దగ్గర వానల కారణంగా ఏదో వంతెన కూలిపోయిందట. ఈరోజు రైళ్ళు నడవ్వట" అన్నాడు రమేష్.

అతడు జోక్ చేస్తున్నాడేమోనని నవ్వబోయాను. కానీ రమేష్‌కు నావద్ద జోక్ చేసేటంత చనువులేదని గుర్తురాగానే రాబోయిన నవ్వు ఏడుపుగా మారిపోయింది. ఇప్పుడు నేనేం చేయాలి?

నేను వెంటనే నాతో ప్రయాణం చేయాల్సిన భూషణ్ దగ్గరకు పరుగెత్తాను. ఇద్దరం కలిసి ఫోన్ దగ్గరకు పరుగెత్తాం. రమేష్ నిజమే చెప్పాడు. కలకత్తా వైపు ఏ ట్రయినూ వెళ్ళబోవడంలేదారోజు.

సలహా కోసం నలుగురి దగ్గరకూ పరుగెత్తాం.

మా దురదృష్టం కొద్దీ - మొట్టమొదటే ఓ ఫారిన్ రిటర్న్‌డ్ తగిలాడు - "ఫారిన్ వెళ్ళడానికే ఈ యిబ్బందులు. ఫారిన్లో ఇలాంటి యిబ్బందులుండవు -" అంటూ అతడు అక్కడి రైళ్ళు క్రమం తప్పకుండా ఎలా నడుస్తాయో చెప్పబోయాడు. ఇంటర్వ్యూనుంచి తిరిగివచ్చాక అవన్నీ వింటామని హామీ యిచ్చి - అప్పటికి వినే అవకాశం లేకపోయినందుకు విచారాన్ని కూడా ప్రకటించి - హడావుడిగా మరో కొలీగు దగ్గరకు వెళ్ళాం.

"పూరీ నుంచి కలకత్తాకో బస్సుంది. అది రాత్రి ఎనిమిది గంటలకు భువనేశ్వర్ వస్తుంది. బస్‌స్టాండుకు ఫోన్ చేస్తే మీ అదృష్టం బాగుంటే వాళ్ళు ముందుగానే టికెట్సు కూడా రిజర్వ్ చేయవచ్చు -" అన్నాడతడు.

అతడి మాట పూర్తికాకముందే ఒక్కపరుగున ఫోన్ దగ్గరకు పరుగెత్తాం మేమిద్దరమూ. ఇలా మేము జంటగా పరుగులెత్తడం చాలామందికి వినోదాన్ని కలిగించినట్లు తర్వాత తెలిసింది.

"ఖర్గపూరు ప్రాంతంలో రోడ్లు పాడైన కారణంగా కలకత్తా బస్సు కాన్సిల్ చేశారు -" అన్న చావుకబురు బస్సు స్టాండునుంచి వచ్చింది.

ఇంటర్వ్యూలో నెగ్గడం మాట అటుంచి అసలు ఇంటర్వ్యూకి వెళ్ళడమే ఒక పెద్ద సమస్యగా మారిపోయింది మాకు.

మతి పోగొట్టుకుని జంటగా తిరుగుతున్న మాకు ఓ అనుభవజ్ఞుడు - "భువనేశ్వర్నించి రాత్రి ఏడుగంటల ప్రాంతంలో ఒక బస్సు కియోంజర్ వెడుతుంది. కియోంజర్నించి కలకత్తా వెళ్ళడానికి చాలా బస్సులుంటాయి -" అని సలహా యిచ్చాడు.

గాఢాంధకారంలో మిణుగురుపురుగులా ఈ అయిడియా మా యిద్దరికీ ఓ కాంతిరేఖను చూపింది.

"అయితే మీవాళ్ళను ప్రయాణం ఆపేయమను. మనిద్దరం మగాళ్ళం కాబట్టి ఈ అడవి ప్రయాణం ఎలాగోఅలా చెయ్యొచ్చు -" అన్నాడు భూషణ్.

అన్నీసర్దుకుని ఎప్పుడిల్లు కదులుదామా అని కూర్చుంది శ్రీమతి. ప్రయాణం గురించి పిల్లలు మహాసరదాపడిపోతున్నారు. నామటుకు నాకైతే ఏమాత్రం వీలున్నా ఎన్నికష్టాలైనా భరించి భార్యాబిడ్డలతోనే ప్రయాణం చేయాలనుంది. అందుకని బస్సులో వాళ్ళనూ నాతో తీసుకువెళ్ళాలనుకున్నాను.

భూషణ్ కంగారుగా - "నీకర్థంకావడంలేదు డాక్టర్ రావ్! ఇది పిల్లలూ ఆడవాళ్ళు చేయదగ్గ ప్రయాణంకాదు. మనకైతే అర్జంటు కాబట్టి తప్పదు. ఒకటి రెండురోజుల్లో రైళ్ళ పరిస్థితి బాగుపడుతుంది. అప్పుడు వాళ్ళు ట్రయిన్లో రావచ్చు -" అన్నాడు.

కలకత్తా వంటి మహానగరానికి వసు ఒంటరిగా పిల్లలతో చేరుకోగలదా? అన్నయ్యకు వాళ్ళు వస్తున్నట్లు ముందుగా ఎలా తెలుస్తుంది? ఈ రైలుమార్గం ఎప్పటికి బాగుపడుతుందో?.. అందువల్ల వాళ్ళను కూడా తీసుకుని బయల్దేరాలనే నాకు తోచింది.

"సరే - వాదనెందుకుకానీ - పరిస్థితి మీ ఆవిడకు వివరించి ఆమె వస్తానంటే తీసుకునిరా. ఇలాంటి ప్రయాణానికి మీ ఆవిడొప్పుకోదని నా నమ్మకం -" అన్నాడు భూషణ్.

భూషణ్ బెంగాలీ బ్రహ్మచారి. ఆడాళ్ళతో ప్రయాణమంటే అతడికి బెంగ. నేనతడితో వాదించకుండా ఇంటికివెళ్ళి శ్రీమతికి పరిస్థితి వివరించాను.

"ఇప్పుడేం చేయాలి?" అంది శ్రీమతి దిగులుగా.

"నువ్వే అన్నావుగా - కథకు వచ్చిన బహుమతి మన జీవితంలో కొత్తమలుపును సూచిస్తున్నదని. నవరసభరితమైన కొత్తజీవితం మనకీ క్షణంనుంచే ఆరంభమయింది -" అన్నాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments